మట్టిని అడుగుదాం... మట్టి మాట విందాం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలంలోని పాలవలస రైతు భరోసా కేంద్రంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ఆధీనంలో మండల స్థాయి భూసార పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామవ్యవసాయ శాఖ సహాయకులుకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, భూసార పరీక్ష ద్వారా, భూ సాంద్రతను అంచనావేసి, మొక్కలు పెరుగుదలకు కావలసిన పోషకాలను అందిస్తూ, పంట దిగుబడిని పెంచడంలో ప్రధాన పాత్ర వహిస్తుందని మండల వ్యవసాయ అధికారులు బి.పద్మనాభం తెలియజేశారు. తద్వారా ఏ పంట వేస్తే బాగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకొని, మంచి దిగుబడి ఇచ్చే పంటను పండించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. "మట్టిని అడుగుదాం - మట్టి మాట విందాం" అనే నినాదంతో అవసరమైన ఎరువులు మాత్రమే వేద్దాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందామని అన్నారు. రైతన్నలు దిగుబడి కోసం అధిక మోతాదులో ఎరువులు వాడటం వల్ల వచ్చే నష్టాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కొత్తూరు సబ్ డివిజన్ (ఏడీఏ) కొత్తూరు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ సర్పంచ్, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ఒక అబ్దుల్ కలాం కావాలి

రవీంద్ర భారతి స్నాతకోత్సవ వేడుకలలో గైనకాలజిస్ట్ డా. హరిత

విశాలాంధ్ర-అరసవల్లి : స్థానిక మండల వీధిలో గల రవీంద్ర భారతి పాఠశాలలో చిన్నారుల స్నాతకోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ ఎన్. గంగారాం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. వేడుకలలో భాగంగా ముఖ్య అతిగా శ్రీకాకుళం ప్రముఖ గైనకాలజిస్ట్ డా. సిహెచ్. హరిత పాల్గొని ముందుగా ప్రముఖుల చిత్రపటాలకు పూలను సమర్పించి అంజలి ఘటించి మాట్లాడుతూ చిన్నారులకు తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సహకారం అవసరమని, ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే చదువుపై దృష్టి పెట్టాలని, అందరూ సేవాగుణం కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక అబ్దుల్ కలాం కావాలని, చిన్నారులను నల్ల కోటు లో చూస్తుంటే అప్పుడే డిగ్రీ పట్టా అందుకున్న వారిలా కనిపిస్తున్నారని అన్నారు. అందరూ బాగా చదువుకొని జిల్లా లో ఉండే ప్రముఖలను ఆదర్శంగా తీసుకొని జిల్లా కీర్తిని పెంచాలన్నారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవంలో భాగంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నల్లకోటులను, ధ్రువపత్రాలను అందజేసి బహుమతులు అందించి చిన్నారులు వేసిన నృత్యాలు ఆశక్తిగా తిలకించారు. ప్రిన్సిపాల్ ఎన్. గంగారాం, డీన్ నాగరాజులు చిన్నారులను ఉద్దేశించి ప్రసంగించినంతరం డా. హరితను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్, విద్యార్థులు, తల్లి తండ్రులు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

విశాలాంధ్ర-మందస : మండలంలోని వివిధ మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలకు 1998 డిఎస్సీలో ఎంపికైన ఆరు గురు అభ్యర్థులు ఉపాధ్యాయులుగా నియ మితులయ్యారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆరుగురుకి ఎంఇవో ఎం.లక్ష్మణరావు నియామక పత్రాలు స్థానిక మండల విద్యా శాఖా కార్యాలయంలో అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘకాలం నిరీక్షణ తరువాత ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ నాయకులు జి.కోదండరావు, ఆర్.పరమేశ్వరరావు, జి.రమేష్, జగదీష్, సోమేశ్వరరావులు అభినందించారు.

కాశీబుగ్గలో : 1998 డిఎస్సీలో ఎంపికైన పలాస మండలానికి చెందిన 15 మంది ఉపాధ్యాయులకు గురువారం ఎంఇవో సి. హెచ్.శ్రీనివాసరావు నూతన ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేశారు.

14 నుంచి ప్రచార భేరి : సీపీఐ, సీపీఎం పిలుపు

విశాలాంధ్ర-పలాస : కేంద్ర, బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలపై ప్రచార భేరి జయప్రదం చేయాలని సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులు సి. హెచ్.సుందర్‌లాల్, ఎన్.గణపతి, సి. హెచ్.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయ ఆవరణలో గురువారం ప్రచార బేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి ప్రచార క్యాంపెయిన్ సాగుతుందని తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఈ ప్రచార బేరి కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం మతతత్వ అజెంబా అమలు చేస్తూ ప్రజలను చీల్చి, ప్రజాధనాన్ని, ప్రభుత్వ రంగ సంస్థను, సహజ వనరులను కార్పొరేట్లుకు కట్టబెడుతున్నదన్నారు. విభజన హామీలు అమలు చేయాలని, ఏపికి ప్రత్యేక హెూదా కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలని, ఈ ప్రాచ బేరి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, వి.కృష్ణారావులు పాల్గొన్నారు.

కార్మికురాలికి వెంకటేష్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : మానవ జీవితం మహెూన్నతమైనదని అందరి జీవితాలు ఆనందంగా ఉండాలని సమాజం లో అందరూ బావుండాలి అందులో మన జీవితాలు కూడా ఉండాలనే ఆశ తొనే నా భార్య మాదారపు యశోదమ్మ ఆలోచన అని బ్రతికి వున్నన్నాళ్ళు అదే స్ఫూర్తితో పనిచేసిందని టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ తెలియజేశారు. గురువారం తన భార్య మాదారపు యశోదమ్మ 10వ వర్ధంతి సందర్భంగా ఆయన ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. వెంకటేష్ మాట్లాడుతూ వెల కట్టలేని గొప్ప విద్య, విలువైన చక్కని వైద్యం, అందరకి అందాలని అపుడే సమస్యలు లేని సమాజ నిర్మాణ జరుగుతోందని తద్వారా అందరూ ఆనందంగా సంతోషంగా ఉంటారని, నా భార్య దివంగత మాదారపు యశోదమ్మ కోరుకునేదని ఆమె ఆశయం అదే అన్నారు. అనంతరం నగరం లో జెండాల వీధి ప్రాంతం లో నివసిస్తున్న పారిశుధ్య కార్మికురాలు సుహాసిని అనే మహిళ కుమార్తె అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న వెంకటేష్, మాదారపు యశోదమ్మ సేవా సమితి సభ్యుల సహకారం తో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు వారికీ అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వెంకటేష్ తో పాటుగా డేవిడ్, ప్రదీప్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజకంగా వైసీపీ పాలన : మంత్రి డా.సీదిరి



విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : రాష్ట్రంలో వైసీపీ పాలన ప్రజారంజకంగా సాగుతోందని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నాలుగేళ్ల పాలన గురించి మరోసారి ప్రజలల్లో కి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం మండలం సుంకర జగన్నాథపురంలో సర్పంచ్ జి.గుండమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ప్రస్తుత వైసీపీ పాలనకు ఎంతో తేడా ఉందని, ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న పథకాలు వర్తిస్తున్నాయని అన్నారు. అర్హులైన వారు ఎక్కడ ఉన్నా వారికి సచివాలయం వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతుల బాగు కోసం వృద్ధులు, మహిళలు, విద్యార్థులు కోసం ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలు దేశంలో ఏ రాష్ట్రంలోను ముఖ్యమంత్రులు తీసుకోలేదని గుర్తు చేశారు. నాలుగేళ్లల్లో చేపట్టిన సంస్కరణలు నవ్యాంధ్ర అభివృద్ధికి సూచకలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాసరావు, ఎంపిపి నీలవేణి ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి శ్రావణి శ్రీనివాసరావు, తహశీల్దార్, ఎంపిడివోలు పాల్గొన్నారు.

రోడ్డు పనులపై తాడివలస సర్పంచ్ అభ్యంతరం

విశాలాంధ్ర-పొందూరు : మండలం తాడివలస పీహెచ్సీ రహదారి పనులపై సర్పంచ్ మనమ్మ అభ్యంతరం వ్యక్తం చేసారు. శాశ్వతరోడ్డు (సీసీరోడ్డు)కు బదులుగా కేవలం మట్టిరోడ్డు నిర్మాణం చేయడం అదీ సక్రమంగా పనులు చేయకుండా కేవలం పైపైనే పనులు చేయడంపై అబ్యంతరం వ్యక్తం చేసారు. అసలు తన పంచాయతీ పరిధిలో రోడ్డు పంచాయతీ తీర్మాణం లేకుండా. తనకు ఎటువంటి సమాచరం లేకుండా పనులు చేయదు. సర్పంచ్న అవమానించడమేనని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. దీనిపై అధికారు లకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సీపీఐ ప్రచార భేరిని జయప్రదం చేయండి

సీపీఐ సీనియర్ నాయకులు లక్కోజి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-నరసన్నపేట : మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల ను నిరసిస్తూ, ప్రజలను చైతన్యం చేయటానికి సీపీఐ పార్టీ అధ్వర్యంలో లో నిర్వహిస్తున్న ప్రచార భేరి జయప్రదం చెయ్యాలని సీపీఐ సీనియర్ నాయకులు లక్కోజి శ్రీనివాసరావు అన్నారు. నరసన్నపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని ఈనెల 14న నుంచి ప్రారంభించనున్న సిపిఐ ప్రచార బేరి కార్యక్రమానికి సంబంధించి మండలంలోని పార్టీ నాయకులు, సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ అధికారం లోకి వచ్చాక దేశం లోని అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటు పడిందని, పేదలను దోచి అదానీల వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపద కట్టబెట్టడ మే పనిగా పెట్టుకుని సామాన్యుల కు తీవ్ర అన్యాయ్యం చేస్తున్నారు అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ లు ప్రైవేట్ కు కారు చౌకగా కట్ట బెడు తున్నారు అని, మోడీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి అని, అర్ ఎస్ ఎస్ భావజాలం లో దేశాన్ని కాషాయమయం చెయ్యాలని మతాల, కులాలు మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధిపొందుతున్నారన్నారు. మోడీ పాలనలో దేశం తిరోగమనం దిశగా పయనిస్తుంది అని, మోడీ పాలనను సాగణంపక పోతే భవిష్యత్ తరాలకు పెను ముప్పు అన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాల మీద ప్రజలను చైతన్యం చేసి బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. మోడీ నయవంచన పాలన ను ప్రజలకు వివరించి దేశ అభివృద్ధి కి, శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరూ ఈ ప్రచార భేరి లో పాల్గొని జయప్రదం చెయ్యాలి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కె.శ్రీనివాసరావు, నిమ్మాడ కృష్ణ, సభ్యులు అరవింద్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశించింది బడుగు బలహీన వర్గాల సంక్షేమం

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: బాబాసాహెబ్ డా.బి ఆర్ అంబేద్కర్ తన సర్వస్వం ధారబోసి బడుగు బలహీన వర్గాలకు రక్షణ కల్పిస్తూ నవ భారత రాజ్యాంగం ఈ దేశానికి అప్పగిస్తే నేడు వైకాపా ప్రభుత్వ పాలనలో అడుగడునా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ దళితులను అణగతొక్కుతున్నారని, వైకాపా ప్రభుత్వం ఈ నాలుగేళ్ళ పాలనలో దళిత సంక్షేమం సమూలంగా నాశనం అయిపోయిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు పేర్కొన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్లు నామమాత్రంగా నిలిచిపోయాయని, దళితులకు రుణాలు మంజూరు, భూపంపిణీ లు లేకపోగా తిరిగి దళితులకు ఇచ్చిన భూములను దౌర్జన్యంగా లాక్కొని ఇతరులకు పంపిణీ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. యస్ సి కార్పొరేషన్ నిధులు మళ్లించి నవరత్నాలకు వినియోగించడంపై హైకోర్టు కూడా ఘాటుగా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఇక దళితులపై దౌర్జన్యాలు, హత్యలు, మహిళాలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. దళితుల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన ఇరవై ఏడు పథకాలను రద్దుచేసి ఘనత వైకాపా ప్రభుత్వానికే చెందుతుందన్నారు. వైకాపా పాలనలో దళితులు దగాపడ్డారని, అందుకే దళితులు అందరూ రాబోయే ఎన్నికల్లో తగు మూల్యం చెల్లించి, దళితుల సంక్షేమం కోరుకునే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో డివిజన్ ఇంచార్జి కవ్వాడి సుశీల తదితరులు పాల్గొన్నారు.

విశ్వసముద్రకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి

సీపీఐ నాయకులు నారాయణస్వామి డిమాండ్

విశాలాంధ్ర -కవిటి: సహజ వనరులు వాడుకునేందుకు కూడా డబ్బులు కట్టాలని ఆ బాధ్యత విశ్వసముద్ర కంపెనీకి అప్పగించటం వలన ఆ భారం సామాన్యుల మీద పడుతుందని, కంపెనీకి ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కంచిలి మండలంలోని స్థానిక శ్రీకంచమ్మ క్వారీ లారీ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ విశ్వస ముద్ర కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. సహజ వనరులైన మట్టి, కంకరలు సామాన్యులు అవసరం మేరకు తక్కువ ఖర్చుతో వినియోగించుకునేవారని, ఇప్పుడు ప్రైవేట్ కంపెనీ అనుమతులు ఉండాలని, దానికోసం నెలకు రూ.13 కోట్ల విశ్వసముద్ర కంపెనీకీ అప్పగించటం తో వారికి తోచిన విదంగా రేట్లు పెంచటం వలన సామాన్యులు తట్టెడు మట్టి కొనాలన్నా వారి అనుమతితో డబ్బులు చెల్లించి కొనాల్సిరావటం దారుణమన్నారు. జిల్లాలో గ్రానైట్ బ్లాక్‌లు అనుమతులు లేకుండా అక్రమ మార్గంలో వెళుతున్నాయని, వాటిని కట్టడి చేయడానికని అధికారం ప్రైవేట్ చేతికి అందిస్తే అది ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చుని, కంపెనీ లాభం కోసం అవినీతికి పాల్పడదు అనే గ్యారెంటీ ఉందా అని అన్నారు. కంకర, మట్టికి క్యూబిక్ మీటర్‌కి 106 రూపాయిలు చెల్లించాలని, అలాగే చిప్స్, రాయ బుగ్గికి కూడా అనుమతులు కోసం రుసుం పెంచి సామాన్యుల మీద మరింత భారం పడుతుందన్నారు. అక్రమ మార్గంలో

తరలిస్తున్న వాటిని అరికట్టాలంటే మైనింగ్ శాఖను మరింత పటిష్టం చెయ్యాలి తప్ప సహజ వనరులు ప్రైవేట్ కంపెనీకి అప్పగించటం వలన మరింత నష్టం జరుగుతుంది తప్ప లాభం ఉండదన్నారు. వెంటనే ఈ అనుమతులు రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని, లేనిపక్షంలో సీపీఐ ఉమ్మడి పోరాటాలు చేస్తుందన్నారు. సామాన్యులకు నష్టంచేసే ఇలాంటి ఆలోచనలు ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సాలిన మోహనరావు, రంగోయి హేమసుందరరావు, ఎస్. మోహన్, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై గ్రామస్తుల ఆందోళన

విశాలాంధ్ర-జలుమూరు: ప్రభుత్వ కార్యాలయాలకు దగ్గరలో ఉన్న చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు తెలిపారు. చల్లవానిపేట జంక్షన్లో రాయివింద, ఈశ్వరప్ప కోనేరు, ఊడికలపాడు జగన్నాథ చెరువుతో పాటు మండలంలో శ్రీముఖలింగం, పులిబంద, నేరేడిబంద, జీలుగుబంద, నగిరికటకం, కుమ్మరిబంద, జోడుబంద, జెమినివలస, తట్టిబంద, అచ్యుతాపురం, కొమనాపల్లి మండలంలోని అనేక చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్వహిందూ పరిషత్ క్యాలెండర్లు పంపిణీ

విశాలాంధ్ర-జలుమూరు: మండలం పరిధిలో ఉన్న లింగాలవలస గ్రామంలో విశ్వహిందూ పరిషత్ క్యాలెండర్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, శ్రీరంగం మధుసూదన్ రావు, కరగాన సోమేశ్వరరావు, కొయ్యన కిరణ్ కుమార్, ఆశి ఉమామహేశ్వర్ రెడ్డి, రావాడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు.

25ఏళ్ల కల నెరవేరిన వేళ

ఎట్టకేలకు 98 డీఎస్‌సి ఉపాధ్యాయులకు పోస్టింగ్

విశాలాంధ్ర-కొత్తూరు : ఉపాధ్యాయ శిక్షణ పొందాం, ఉపాధ్యాయ వృత్తిలో ఇక స్థిరపడదాం అనే 1998 డీఎస్సీలో మెరిట్ సాధించిన నిరుద్యోగ ఉపాధ్యాయులకు వారు ఉద్యోగాల్లో చేరడానికి 25 ఏళ్ళు పట్టింది. సుదీర్ఘకాల న్యాయ పోరాటం అనంతరం వీరికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఆయా మండలాలకు కేటాయిస్తూ నియామకపత్రాలను అందజేసింది. శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 352 మంది 98 డిఎస్సి నియామకాలకు సంబంధించి 19 మంది అభ్యర్థులు వివిధ కారణాలతో ఉద్యోగాల్లో చేరలేదు. 333 మందిని జిల్లాలోని వివిధ మండలాలకు కేటాయిస్తూ జిల్లా విద్యాశాఖ నియామకాలు జరిపింది. ఇందులో భాగంగా కొత్తూరు మండలంకు ఐదుగురు 98 డీఎస్సీ ఉపాధ్యాయులను కేటాయించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి విశేష స్పందన

విశాలాంధ్ర-పలాస: పలాస 33/11 కె.వి సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విశేష స్పందన వచ్చిందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యన్నారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలుంటే తమకు నేరుగా ఫిర్యాదు చేసి పరిష్కారం చేసుకోవచ్చుని అన్నారు. విద్యుత్ శాఖలో అనేక సంస్కరణలు అమల్లో ఉన్నాయని, విద్యుత్ సమస్యలు స్థానికంగా పరిష్కారం కాకపోతే నేరుగా విశాఖపట్నం విద్యుత్ ప్రాంతీయ కార్యాలయంలో ఉన్న పరిష్కార వేదికకు ఫిర్యాదు చేస్తే న్యాయబద్ధంగా ఉంటే తక్షణమే పరిష్కారించడం జరుగుతుందని అన్నారు. ముందుగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పి.శ్రీనివాసరావు, ఎస్.హరిబాబు, ఆర్.సురేంద్రకుమార్, టెక్కలి విద్యుత్ శాఖ ఇ.ఇ రాజశేఖర్, పలాస ఎడిఇ క్రిష్ణమూర్తి, ఎ.ఇలు వివేక్, నాగభూషణ్, ఎల్‌ఐఇలు రాజారావు, గిరి, విద్యుత్ శాఖా సిబ్బంది పాల్గొన్నారు.

మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక 33వ వార్డు ఆడంగివారివీధిలో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం గురువారం ఇన్‌ఛార్జి భాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మెంటాడ వెంకట పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ఇక్కడున్న వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల కాలంలో కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్నామని, ఇవాళ ప్రజలంతా ఈ నాలుగేళ్ల కాలంలో ఆనందంగా ఉన్నారన్నారు. నాడు - నేడు పేరిట నిర్వహిస్తున్న స్కూల్స్ ఏవిధంగా అభివృద్ధి చెందాయో అన్నది మీకు తెలుసని, అలానే చిన్నారులకు ఆధునిక సాంకేతికతతో కూడిన విద్య, విలువలతో కూడిన విద్యను అందిస్తూ ఉన్నామని, అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా పోషకాహారం అందిస్తున్నా మన్నారు. మధ్యవర్తుల ప్రమేయం అన్నది లేకుండా అందిస్తున్న సంక్షేమ పథకా అభివృద్ధి అన్నది పాఠశాలలో ఏ విధంగా ఉన్నది అన్నది అందరికీ తెలుసన్నారు. ఇది కాదా మార్పు అని అన్నారు. ఈ ప్రభుత్వం ధనికుల కోసం కాదు పేద ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి భాషా, సురేష్, పావని, దేవా, సాగర్, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం నౌపడా సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని టెక్కలి ఈఈ,వి ఎ రాజశేఖర్, సంతబొమ్మాలి విద్యుత్ శాఖ ఏఈ శివకుమార్ తెలిపారు నౌపడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మెయింట్ నెన్స్ పనులు చేయడం వలన విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని ఆయన కోరారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్తు నిలుపుదల చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

9మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేత



విశాలాంధ్ర-కవిటి : 1998 ఉపాధ్యాయుల నియామకాల్లో ఎంపికైన 9 మంది అభ్యర్థులకు మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి ఉపాధ్యాయుల నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గురువారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద 9 మందికి ఉపాధ్యాయ పోస్టుల నియామక పత్రాలు ధనుంజయం మజ్జి చేతుల మీదుగా అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ తాళ్లభద్ర సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాళభద్ర గ్రామానికి చెందిన దుర్యోధన (43) అక్కడికక్కడే మృతి చెందారు. దుర్యోధన ద్విచక్ర వాహనంపై తాళభద్ర నుంచి కాశీబుగ్గ వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనవడంతో దుర్యోధన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు దుబాయ్‌లో కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబమంతా శోకసముద్రంలో మునిగిపోయింది. మృతుడికి జయలక్ష్మి, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కాశీబుగ్గ ఎస్.ఐ గోపాలరావు తెలిపారు.

మృతుని కుటుంబాలకు నష్టపరిహారం

2 లక్షల చెక్ అందించిన ఏపీ స్పీకర్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయం లో పనిచేసిన కూన వెంకట్రావు, దుంపల సత్యం మృతిచెందిన విషయం విధితమే. మృతుల కుటుంబాలకు రెండేసి లక్షల రూపాయల చొప్పున నష్ట పరిహారాన్ని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం చేతుల మీదుగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో అందించారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేసిన కృష్ణాపురానికి చెందిన కూన వెంకట్రావు, ఆమదాలవలస కు చెందిన దుంపల సత్యం ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఒక్కొక్కరికి రెండు లక్షల చొప్పున చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలకు అప్పగించిన లక్ష్యాలను అధిగమించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాలకు సంబంధించి జిల్లాలకు అప్పగించిన లక్ష్యాలను అధిగమించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను కోరారు. గురువారం జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు ఓటర్ల నమోదు కార్యక్రమానికి సంబంధించి కొత్తగా నమోదు చేయాల్సిన ఓటర్ల వివరాలతో పాటు తొలగించాల్సిన ఓటర్ల వివరాలను కూడా మరోమారు పరిశీలించి జాబితాను సరిచేయాలన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమన్వయ కమిటీ సమావేశాలు, ఏఏ సందర్భాలలో సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలనే విషయమై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఇందుకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషనును కూడా తయారు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి జిల్లాలో వారికి అప్పగించిన లక్ష్యాలను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్, సంయుక్త కలెక్టర్ యం.నవీన్, జిల్లా రెవిన్యూ అధికారి యం.రాజేశ్వరి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, శ్రీకూర్మం

రేఖా.నెం.10/2023 — తే:13-04-2023ది

టెండర్ ప్రకటన

శ్రీకాకుళం జిల్లా గార మండలం, శ్రీకూర్మం గ్రామ పంచాయతి నందుదిగువ సుదుహరించిన షెడ్యులు-1 చూపబడిన సామాగ్రి 2023-2024 సం.నకు సప్లై చేయుటకు షెడ్యూల్-2లో చూపబడిన పనులు చేయుటకు తే:21-04-2023ది ఉదయం గం.11-00 నుండి శ్రీకూర్మం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించబడును. వేలం పాటలలో పాల్గొనదలచినవారు గుత్త వివరమునకు ఎదురుగా చూపిన మొత్తమునకు తక్కువగాని విలువ గల మోతుబరి ధృవపత్రం దాఖలు చేసి పాల్గొనవలెను మరియు సామాగ్రి సప్లయి చేయుటకు దాఖలు చేయు టెండర్ దారులు టెండర్ ధరావత్తు చెల్లించి అదేరోజు ఉదయం గం.11-00 నుండి మధ్యాహ్నం గం.1-00 వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యోగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం.3-00లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును. టెండరుదారులు టెండర్ షరతులకు లోబడి పాల్గొనవలెను.

షెడ్యులు-1

వ.నెం.	సరఫరా సామగ్రి వివరములు	కాంట్రాక్టు పని కాలము	చెల్లించవలసిన ధరావత్తు
1)	పి.హెచ్ ఆర్టికల్స్ (బ్లీచింగ్, పోడిసున్నం, మొదగు.)	2023-24సం.నకు	రూ.500/-
2)	బోర్ వెల్ సామాగ్రి	2023-24సం.నకు	రూ.500/-
3)	సిబ్బంది యూనిఫార్మ్ (ఏక రూప దుస్తులు)	2023-24సం.నకు	రూ.500/-
4)	L.E.D వీధి విద్యుత్ దీపాల విడి భాగాలు	2023-24సం.నకు	రూ.500/-
5)	ఈ కార్యాలయ నిర్వహణ నిమిత్తం అవసరమైన స్టేషనరి	2023-24సం.నకు	రూ.500/-

షెడ్యులు-2

వ.నెం.	పని వివరములు	పోస్టుల సంఖ్య	చెల్లించవలసిన టెండర్ ధరావత్తు
1)	పారిశుద్ధ్య కార్మికుడు	01	రూ. 1000/-

షరతులు :
1) షెడ్యూల్-2 నందు తెలపిన కాంట్రాక్ట్ పనిని G.O MS.No.57 PR&RD (Esst.III) Department. Dated : 13-02-2019 ప్రకారం నెలసరి కాంట్రాక్ట్ మొత్తం రూ.10,000/-లకు మించకుండా టెండర్ దాఖలు చేయవలెను మరియు సదరు పనులలో అనుభవం కలిగినవారికి మొదటి ప్రాధాన్యత కల్పించబడును.
2) కాంట్రాక్ట్ దారులకు చెల్లించవలసిన నెలవారి కాంట్రాక్ట్ మొత్తమును ఈ గ్రామ పంచాయితీ సాధారణ నిధుల లభ్యత మేరకు మాత్రమే చెల్లించబడును.
3) గ్రామ పంచాయితీచే ఖాయపరచబడిన టెండరుదారు శ్రీయుత జిల్లా పంచాయితీ అధికారి శ్రీకాకుళం వారి యొక్క ఉత్తర్వులకు లోబడి విధిగా కాంట్రాక్ట్ అగ్రిమెంట్ సమర్పించవలెను.

టెండర్లను ఎట్టి కారణము చూపి గాని, చూపకుండా గాని, వాయిదా వేయుటకు గాని, తిరస్కరించుటకు గాని పూర్తి అధికారం ఈ గ్రామ పంచాయితీనకు మరియు అందులకు సంబందించిన అధికారులదై యుండును. పూర్తి షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయ పని వేళల యందు అడిగి తెలుసుకోవలెను.

సం.//-ఎ. కేశవరావు,
కార్యనిర్వహణాధికారి (పంచాయితీ కార్యదర్శి)
గ్రామ పంచాయితీ,
శ్రీకూర్మం

అసెంబ్లీ ఎన్నికలకు వైసీపీ రెడీ

విశాలాంధ్ర-పలాస : పలాస నియోజకవర్గం వైసీపీలో ఆ నలుగురు బాధ్యతలను ఎవరు శంకించలేని విధంగా వ్యవహరిస్తున్నారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు వారే సారధ్య బాధ్యతలు చేపడతారని వైసీపీ పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అయితే ప్రతి విషయంలో వారే కలుగజేసుకుంటున్నారని ప్రచారం జరగడంతో వైసీపీకి ప్రతికూల వాతావరణం ఏర్పడినట్లు తెలుస్తోంది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై ఈ నలుగురు అనే పదం తీవ్ర ప్రభావం చూపి పార్టీ పునాధులు కదిలే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ఆ నలుగురు అభిమానులు బయట వ్యక్తం చేస్తున్న ఆవేదన మరోలా ఉంది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ఆ నలుగురు అసెంబ్లీ ఎన్నికలకు ముందే అండగా ఉండి పార్టీకి మూల స్తంభాలుగా ఉండడంతో వారిపై ఈర్ష్య ధ్వేషంతో అసూయభావంతో దుష్ప్రచారం చేస్తున్నారని కొంతమంది పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలుగురు పేరుతో, మంత్రి పేరుతో పార్టీలో కొన్ని కొన్ని దుష్టశక్తులు అరాచకాలు చేస్తున్నారని, పార్టీ పేరుతో భూదందాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, అవినీతి, అక్రమార్కులకు పాల్పడి ఈ నలుగురుని టార్గెట్ చేస్తూ చెడు ప్రచారం చేస్తున్నారని వారి అభిమానులు కొంత మంది వాపోతున్నారు. నిరంతరం పార్టీ కోసం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అభ్యున్నతి కోసం పని చేస్తూ ఎక్కడికక్కడ ప్రజా సమస్యలపై దృష్టి పెడుతూ పరిష్కరిస్తున్నారని, వారే లేకపోతే పార్టీకి మరింత కష్టాలు వచ్చే అవకాశం ఉందని తెలుపుతున్నారు. ఆ నలుగురుపై చేదు ప్రచారం చేయడం వలన వారు మానసిక క్షోభకు గురవుతున్నారని పలువురు పేర్కొన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో ఆ నలుగురు లేకపోతే మరింత అరాచకాలు పెరిగిపోతాయని, వారు ఉద్ఘాటిస్తున్నారు. పార్టీకి కంటికి రెప్పలా కాపాడుతూ వస్తున్న వారిపై ఇటీవల పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కూడా స్వయంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వారిని వెనకేసుకు రావడం నియోజకవర్గ ప్రజలు గమనించారు. వారు తప్పు చేస్తే తాను తప్పు చేసినట్లు భావించాల్సి వస్తుందని స్వయంగా జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ సమక్షంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రసంగించడం ఆయన దృష్టిలో వారికి ఉన్న స్థానమేమిటో చెప్పకనే చెప్పారు. అయితే కొంత మంది కప్పదాటు నాయకుల వలన ఈ నాలుగేళ్లల్లో అనేక పరిణామాలు జరగడం దాని ప్రభావం ఆ నలుగురిపై పడడంతో ఒకానొక సందర్భంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కూడా అసహానానికి ఆవేదనకు గురైనట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు. మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపధ్యంలో ఆ నలుగురే మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విజయానికి రధ సారధులవుతారని, ఇప్పటికే వారి పనితనాన్ని నియోజకవర్గ ప్రజలకు తెలుసునని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదిఏమైనా ఎన్ని విమర్శలు వారిపై వచ్చినా కడ వరకు మంత్రి డాక్టర్ సీదిరి వెంటే వారి పయనం ఉంటుందని వారి సలహాలనే మంత్రి పాటిస్తారని పలువురు పేర్కొన్నారు.

వార్డు వాలంటీర్లు పార్టీ స్టిక్కర్లు అంటిస్తే చర్యలు తప్పవు

టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రభుత్వం నుంచి జీతాలు, పారితోషకం తీసుకుని, వైకాపా పార్టీ కార్యక్రమాలు చేపడితే అట్టి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను జిల్లా టీడీపీ అధ్యక్షులు కూన రవికుమార్ కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు వార్డు వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పార్టీ స్టిక్కర్లు ఇంటి గోడలకు అంటిస్తున్నట్లు జిల్లా పార్టీ దృష్టికి వచ్చిందని అట్టివారిని గుర్తించి తగిన ఆధారాలతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నుండి జీతాలు తీసుకుంటూ ఒక పార్టీకి అనుకూలంగా పనిచేయడం, అదేవిధంగా ఇంటి యజమానుల అంగీకార పత్రాలు తీసుకోకుండా గోడలకు పత్రికలు అతికించడం చట్టరీత్యా నేరంగా పరిగణింపబడుతుందని, తెలిపారు. వార్డు వాలంటీర్లు ఎటువంటి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనరాదని ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసారు. ఓటర్ల జాబితాలో పేర్లు చేర్పులు, తొలగింపుల ప్రక్రియ కేవలం బూత్ లెవెల్ అధికారులు చేపడతారని ఎక్కడైనా వాలంటీర్లు గాని, సచివాలయం సిబ్బంది గానీ చట్టవ్యతిరేకమైన కార్యకలాపాల్లో పాల్గొన్నా తెలుగుదేశం పార్టీ శ్రేణులు అప్రమత్తమై వారి ఫోటోలు తీసి ఆధారాలతో జిల్లా తెలుగు దేశం పార్టి కార్యాలయంలో అందచేయాలని కోరారు.

అభినవపూలే... ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్ర కళింగ వైశ్య కార్పోరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 189 బి.సి కులాలకు మరింత సంక్షేమం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణగా తీసుకున్న చొరవతో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా బి.సి. కులగణనకు ముఖ్యమంత్రి వై. యస్. జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టడం హర్షణీయమని జగనన్న అభినవపూలే అని, జగనన్న బి.సి కులాల పక్షపాతి అని అంధవరపు సూరిబాబు హర్షం వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాలకన్నా బి.సి కులగణన విషయంలో ముందుండాలని జగనన్న ఆకాంక్షని ఇప్పటికే ఈ కార్యక్రమం నిర్వహించతలపెట్టిన రాష్ట్రాలు బీహార్, పంజాబ్, ఒరిస్సాలో అధ్యయనం చేయడానికి బి.సి సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఒక కార్యాచరణ రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలన్న జగనన్న సంకల్పం బి.సి లకు ఒక వరమని తెలియజేశారు. కోవిడ్ కారణంగా ఆలస్యమైన దేశవ్యాప్త జనాభాగణన సేకరణలో బి.సి కులంను పట్టికలో చేర్చి కులగణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ఇపుడు రాష్ట్ర పరిధిలో కులగణనకు సన్నద్ధమవడం, దీనిపై అధ్యయనానికి రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జగనన్న బి.సి పక్షపాతని మరోసారి నిరూపించుకున్నారని అన్నారు. రాష్ట్రంలో బి.సి కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించడం ప్రారంభమైనదని, తద్వారా జనాభా లెక్కల సేకరణలో కులం పట్టికలో చేర్చి కులగణన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం, బి.సి.లు రాజకీయ, సామాజిక, సంక్షేమ రంగంలో ప్రాతినిధ్యం, ప్రాధాన్యంతోపాటు సంపూర్ణ సంక్షేమ ఫలాలు అందించాలన్న జగనన్న సంకల్పం ఎంతో హర్షణీయమన్నారు. కులాలు వారీగా లెక్కలు తేలితే బి.సి. కులాలకు విద్య, ఉద్యోగ, నిధులు, పదవులు, రిజర్వేషనులు, సంక్షేమ పథకాలు జనాభా ప్రాతిపదికన వారికి అందుతాయని, 20 సంవత్సరాలుగా దేశంలో అనేక బి.సి సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ఇంతకుముందు ఏ జాతీయ పార్టీ శ్రద్ధ చూపకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో దీనిపై కార్యాచరణ చేపట్టిన జగనన్నకు అనేక బి.సి సంక్షేమ సంఘాలు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలియజేశారని, దేశంలో 52 శాతం పైగా ఉన్న బి.సి కులాలకు జగనన్న తీసుకున్న ఈ నిర్ణయం వారి అభ్యున్నతికి నాంది అని సూరిబాబు హర్షం వ్యక్తం చేశారు.

పూలే, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

విశాలాంధ్ర-మందస: మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని కె.ఎన్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్ అన్నారు. గురువారం మండలం బాలిగాంలో జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఏప్రిల్ 11 నుంచి 14వ తేదీ వరకు పూలే, అంబేద్కర్ జయంతోత్సవాలు నిర్వహించాలని, అగ్రకుల పాలకుల అదిపత్య శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని అన్నారు. కార్యక్రమంలో రామ్మూర్తి, లక్ష్మీ, జానకి, రమణమ్మ, రమేష్, సురేష్, అప్పారావు, రామారావులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక ఆర్థిక సర్వే

విశాలాంధ్ర-కాశీబుగ్గ : గ్రామాల్లో సామాజిక ఆర్థిక సర్వేను చేస్తున్నామని జిల్లా ఉప గణాంకాధికారి దేసూళ సురేంద్ర తెలిపారు. గురువారం పలాసలో కేమ్స్, ఆయూష్ సర్వేను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1950 నుంచి సర్వే చేస్తున్నారని, 2022-23 ఏడాదికి 79వ రౌండ్‌లో కేమ్స్, ఆయూష్ ఆరోగ్య గురించి సర్వే చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 20 గ్రామాల్లో 20 శాంపిల్స్ ర్వే చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సర్వేలో కనీస సదుపాయాలు మంచినీరు, రోడ్లు, ఆసుపత్రి, బస్సు సౌకర్యం, వైద్యం, మొబైల్ నెట్‌వర్క్, కంప్యూటర్, టీ.వి వాడకం, శానిటేషన్ వినియోగం వగైరా అవసరమైన సమాచారాన్ని సేకరిస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు పి.సి నందా, ఎఎస్‌వో జోగారావు, వాలంటీర్లు ఉన్నారు.

విలాసాలకు పోవద్దు-విలువలే ముద్దు : ఏ.పి.ఎం.

విశాలాంధ్ర-ఆమదాలవలస: ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో, స్వయం శక్తి సంఘాల మహిళలు, వారి కుటుంబాల అభివృద్ధి కోసం ప్రతి ఏడాది మీ ఖాతాలకు మంజూరు చేస్తున్న వైఎస్సార్ ఆసరా నిధుల ను ఎవ్వరూ విలాసాల కోసం కాకుండా, కుటుంబ విలువలను కాపాడుకోవడానికి వినియోగించుకోవాలని, వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. గ్రామ సంఘం స్థాయిలో గల మహిళా సంఘాల అవగాహన కార్య క్రమం పొన్నాంపేట లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల గురించి ప్రతి సంఘ సభ్యురాలకు ఖచ్చిత మైన అవగాహన ఉండాలని తెలిపారు. ఎవ్వరూ సంఘం ఖాతా నుంచి డైరెక్టుగా డబ్బులు విత్ డ్రా చేయవద్దని, సభ్యురాలి ఖాతాకు ట్రాన్స్ఫర్ చేసి ఆ సభ్యురాలి కుటుంబ అత్యవసర ఖర్చులకు, పిల్లల చదువులకు ఉపయోగపడే టట్లు విని యోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులతోపాటు వి.వో.ఏ. గాయత్రి , స్వయం శక్తి సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ మీడియా

- ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమినేని శ్రీనివాసరావు
- ఎలక్ట్రానిక్ మీడియా శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రజాస్వామ్యా నికి మీడియా పట్టుకొమ్మవంటిదని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమినేని శ్రీనివాసరావు అన్నారు. జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల జయంతులను పురస్కరించుకొని విజయవాడలోని ఎంజీ రోడ్డులో ఉన్న ఠాగూర్ లైబ్రరీలో ఏపీ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు శాసపు జోగినాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అల్లు యుగంధర్ లను దుశ్శాలువతో, పూల మొక్కలతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మీడియా ప్రపంచానికి అద్దం లాంటిదని, ఇది ప్రపంచంలోని నిజమైన, కఠినమైన వాస్తవాలను ప్రతిబింబిస్తుందని చెప్పారు. ఎందుకంటే మీడియాను ప్రతి ఒక్కరూ విశ్వసిస్తారని, ప్రజలు ఎల్లప్పుడూ వాస్తవ నిజాయితీ వార్తలను విశ్వసిస్తారని వివరించారు. మీడియాకు దాని స్వంత అభిప్రాయం ఉంది కానీ వారు దానిని తమ సంపాదకీయాలలో ప్రచురించవచ్చునని, అక్కడ ప్రజలు దానిని అంచనా వేయవచ్చునని చెప్పారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి. విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా మీడియా ద్వారా ప్రభావితమవుతారని, వారు ప్రభుత్వాన్ని రూపొందించడంలో తొలగించడం లో ముఖ్యమైన పాత్ర పోషిస్తారన్నారు. కాబట్టి ప్రభుత్వాన్ని రూపొందించడంలో మీడియా చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, అది సమాజాన్ని ప్రభావితం చేస్తుందని చెప్పడం తప్పు కాదని, మీడియా వివిధ చట్టాలు నిబంధనల ద్వారా నియంత్రించబడుతుందని వివరించారు. పౌర, రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ఒడంబడిక లోని ఆర్టికల్ 19 వాక్ స్వాతంత్ర్య హక్కును పేర్కొందని, ప్రతి ఒక్కరికి జోక్యం లేకుండా అభిప్రాయాలను కలిగి ఉండే హక్కు, సరిహద్దుల తో సంబంధం లేకుండా అన్ని రకాల సమాచారం ఆలోచనలను వెతకడానికి, స్వీకరించడానికి అందించడానికి స్వేచ్ఛ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు..ఈ కార్యక్రమానికి కో..ఆర్డినేటర్ గా ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.బి.జి.తిలక్ వ్యవహరించారు. ఈ సదస్సులో రాష్ట్ర జర్నలిస్టుల ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎం.శేషగిరిరావు, అధికార భాషా కమిటీ చైర్మన్ పి.విజయబాబు, ఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, జి.శాంతమూర్తి, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈమండలం మేఘవరం పంచాయతీలో ప్రజా ప్రతినిధులు గురువారం ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించారు. మేఘవరం పంచాయతీ సర్పంచ్ పరపటి సునీత శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సూరాడ రాజారావు ఆధ్వర్యంలో గురువారం మండల జడ్పీటిసి పాలవసంపరెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి అప్పారావు, ఉపాధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, రోజుకి 272 రూపాయలను వేతనం పొందాలని, ఉపాధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ నక్క భీమారావు, మేఘవరం మాజీ సర్పంచ్ పరపటి మేనకేతన్ రెడ్డి, పంచాయతీ ఉపసర్పంచ్ మంకు సింహాచలం, ఉపాధి హామీ పథకం వేతనదారులు, పంచాయితీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఎంపీ యూపీ పాఠశాలలో ఘనంగా ఫేర్వెల్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ పంచాయతీ, యం మరువాడ ఎంపీ యూపీ పాఠశాలలో ఫేర్వెల్ కార్యక్రమం సందర్భంగా విద్యార్థుల డాన్సులు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యా యులు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మరువాడ పంచాయతీ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ సూరాడ దాసురాజు, విద్యార్థులు తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ఎంపీడీవో పరిశీలన

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : మండలంలోని గోనిపాడు, మూల సవలాపురం పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పి.మురళీ మోహన్ కుమార్ పరిశీలించారు. చెరువులను బాగు చేసుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్నటువంటి ప్రోత్సాహకానికి తగు న్యాయం చేయాలని అన్నారు. అటెండెన్స్ విషయంలో తప్పులు తడకలు జరిగితే ఉపేక్షించేదే లేదని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం మూల సవలాపురం ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్లను పరిశీలించారు.

అభ్యర్ధన మేరకు వెసులుబాటు కల్పించాలి

ఎస్టీయూ నాయకులు ఎస్వీ రమణ, తమ్మినాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పదవ తరగతి పరీక్ష పేపర్‌ల స్పాట్ వ్యాల్యుయేషన్‌లో ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు వెసులుబాటు కల్పించాలని, కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ఉపాధ్యాయ (ఎస్టీయూ) సంఘం జిల్లా అధ్యక్షులు పడాల తమ్మినాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్వీ రమణ మూర్తి లు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారిని కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పాట్ కేంద్రాలు లో నిరంతరం విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, అన్ని కేంద్రాలలో జనరేటర్ ఉండేలా చూడాలని కోరారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఫ్యాన్‌లు, మంచి నీరుతోపాటు ఆ కేంద్రాల్లో వైద్యుల ను కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. దీర్ఘకాలిక అనారోగ్య సంస్థలతో బాధ పడుతున్న వారికి స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన వారికి కూడా వారి కోరిక మేరకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఇంగ్లీష్ మాధ్యమం లో బోధన చేస్తున్న మోడల్, రెసిడెన్షియల్ స్కూల్లో ఉపాధ్యాయలను స్పాట్‌కు తప్పకుండా తీసుకోవాలని, ప్రధాన ఉపాధ్యాయులను పాఠశాల నిర్వహణ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రతీ సారి ఎదుర్కుంటున్న స్పెషల్ అసిస్టెంట్ ల కొరతను అధిగమించేందుకు ముందుగానే మండల విద్యాశాఖ అధికారులు అనుమతి తో ఉపాధ్యాయులకు విధులు కేటాయించాలని కోరారు. స్పాట్ సీనియారిటీ లిస్టు లో సీనియారిటీ ఉల్లంఘన సరిచేసి ప్రశాంత వాతావరణం లో స్పాట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు పలు సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సంద ర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు, స్పీకర్ కు అందజేశారు. పారిశుధ్య కార్మికులు బాధ్యతాయుతంగా పని చేసి100 శాతం స్వచ్ఛతను సాధించాలని కోరారు. మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మి కులకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సుకు సంబంధించి రూ.6 వేలు చెల్లింపులు జరి గేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నా రన్నా రు.మున్సిపల్ కార్మికుల రూ.15 వేల వేత నానికి అదనంగా 6 వేలు ఓ హెచ్ ఏ ను ప్రభుత్వం చెల్లించేలా చర్యలు చేపట్టింద న్నారు. ఈ మొత్తం కలిపి పారిశుధ్య కార్మికుల వేతనాలు రూ.21 వేలకు పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య భృతిని చెల్లించిన ఘనత వైసీపీ సర్కార్ కే దక్కిందన్నారు. మూడవ పార్టీగా ఉన్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ లో చేర్చి, న్యాయ మైన వేతనాలు మున్సిపల్ కార్మికులకు దక్కేలా చొరవ చూపిన ఘనత సీఎం కే దక్కిందన్నారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం వలన ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సామాజిక హోదా కల్పించినట్లు అయిందన్నారు. ఉద్యోగులకు స్నేహపూర్వక హస్తం అందించే ప్రభుత్వం వైసీపీ సర్కార్ దే అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. చాలీచాలని వేతనాలు అందుకుంటున్న తరుణాన, తమ కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకునేందుకు వైట్ రేషన్ కార్డు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. క్రింది స్థాయి వర్గాలకు అమలు చేస్తున్న అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు,తమకు వర్తింపచేసేలా సీఎంతో ప్రాతినిధ్యం చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆమదాలవలస ను పరిశుభ్ర ఆమదాలవలసగా చూడాలని తద్వారా ఆరోగ్యవంతమైన ఆమదాలవలస కు కారకులు కావాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్,వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామ హేశ్వరరావు, బోర చిన్నమనాయుడు, దుంపల శ్యామలరావు, జె కే వెంకటబాబు, కుసుమంచి శ్యాం ప్రసాద్, పొన్నాడ చిన్నారావు, పొదుగు శ్రీను, సాదు చిరంజీవి, సంపతి రావు రామారావు, సిల్లామల్లి, పొదిలాపు తిరుపతి, కొప్పిలి సత్యనా రాయణ, సనపల రాజు మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అప్పటి టీడీపీ ప్రభుత్వం పోర్టు పేరుతో ప్రజలకు మోసం : దువ్వాడ ఆరోపణ

విశాలాంధ్ర-టెక్కలి: కింజరాపు ఎర్రన్నాయుడు, అచ్చెన్నాయుడు, తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలను మోసం చేశారని ఆనాడు తెలుగుదేశం పార్టీ భావనపాడు పోర్ట్ నిర్మాణానికి 15 వేల ఎకరాల భూమి సేకరించిందని నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయంలో 400 ఎకరాలలో పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయంలో జరుగుతున్నాయని రాష్ట్రంలో పరిశ్రమలు విస్తృతంగా స్థాపించి పరిశ్రమల ద్వారా నిరుద్యోగ సమస్య తీరాలన్నదే జగనన్న ఆసియమని సమ్మిట్ లో పదమూడున్నార లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు ముందుకు వచ్చాయని అన్నారు. భావనపాడు పోర్టు నిర్మాణ చర్చ నేటిది కాదని ఏడు దశాబ్దాలుగా చర్చ జరుగుతుందని ఇందిరాగాంధీ, బ్రిటిష్ టైంలో కూడా చర్చ జరిగిందని తర్వాత ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా భావనపాడు పోర్టు నిర్మాణానికి చర్చ జరిపారని కానీ ఎవ్వరు కూడా కార్యరూపం దాల్చలేకపోయారని శ్రీకాకుళం జిల్లా చరిత్రలో నాలుగు వేల కోట్ల రూపాయలతో మూలపేట, విష్ణు చక్ర గ్రామాల వద్ద రెండు గ్రామాలకు నష్టపరిహారం ఇచ్చి ఎక్కడ లేనివిధంగా ఎకరాకు 25 లక్షలు ఇస్తూ, నిర్వాసితులకు 55 ఎకరాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఇల్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదగా ఈనెల 19వ తేదీన పోర్టు శంకుస్థాపన చేసి పోర్టు నిర్వాసిత కాలనీలో బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లాకు జలగం వెంకట్రావు 48 వేల కోట్లు, వైయస్ రాజశేఖర్ రెడ్డి 1000 కోట్లు ఇచ్చారని ఇంత ఎక్కువ నిధులు శ్రీకాకుళం జిల్లాకు రావడం ఇదే ప్రప్రదమని అన్నారు. టెక్కలి నియోజవర్గంలో 508 గ్రామాలలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని దీనితో స్థానికంగా నిరుద్యోగ సమస్య తీరుతుందని అన్నారు. కింజరాపు ఎర్రన్నాయుడు, అచ్చెనాయుడు జట్టి కడతామని, మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తామని ప్రజలకు మోసం చేశారని, భావనపాడు అల్లాడా మధ్య పోర్టు నిర్మాణానికి 15వేల ఎకరాల భూమి సేకరించారని కేవలం 400 ఎకరాలలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. పవర్ ప్లాంట్ నిర్మించినప్పుడు కింజరాపు అచ్చెన్నాయుడు 20000 మందికి ఉద్యోగాలు ఇస్తామని దరఖాస్తులు తీసుకొని మోసం చేశారని ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు శంకుస్థాపన చేసి ఫిబ్రవరి నాటికి షిప్ వచ్చేటట్లుగా చేసి ఈ ప్రాంతంలో అతి త్వరలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని అన్నారు.

యువతకు చేయూత ఫిష్ డెలిషియస్ ఆంధ్ర

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మత్స్యకార యువతకు చేయూత ఇచ్చేందుకు ఫిష్ డెలిషియస్ ఆంధ్రా యూనిట్లను నెలకొల్పుతున్నామని, వీటిని సంబంధిత వర్గాల ఆర్థిక ఉన్నతికి తోడ్పాటు అందించే విధంగా ఏర్పాటు చేస్తున్నామని రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. జిల్లాలోనే మొట్ట మొదటిసారిగా నెలకొల్పిన ఫిష్ డెలిషియస్ ఆంధ్రా యూనిట్ ను రాగోలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తరపున సంబంధిత వర్గాలకు చేయూత ఇచ్చేందుకే ఈ యూనిట్ల ఏర్పాటు అన్నది చేస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు ఓ విధంగా ఉపాధి మార్గం కల్పించే విధంగా, ఇటువంటి యూనిట్ల ఏర్పాటు అని చెప్పారు. వీటిని ఏర్పాటు చేస్తున్నామంటే.. అందుకు కారణం సంబంధిత వర్గాలకు ప్రయోజనం కల్పించడమే ధ్యేయమని వివరించారు. వీటి ద్వారా ఎంపిక చేసిన యువతకు కొంత ఆసరా దక్కుతుందని అన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ ఇప్పిస్తూ వీటిని ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఫిషరీస్ డిపార్ట్మెంట్ నేతృత్వాన సరైన సదుపాయాలతో చేపలు, సంబంధిత ఆహార ఉత్పత్తులూ నాణ్యమయిన రీతిలో, రుచికరమయిన రీతిలో అమ్ముకునే విధంగా ఏర్పాటు కూడా చేస్తున్నారు. గుజరాతీ పేట దగ్గర పాలిటెక్నిక్ కళాశాలకు ఆనుకుని ఇప్పుడు కొన్ని నిర్మాణాలు సాగుతున్నాయని, అవి కూడా ఇందులో భాగమే పరిశుభ్రమయిన వాతావరణంలో చేపలు అమ్ముకునేందు వీలు కల్పిస్తోందని చెప్పారు. వీటిని కొందరు అపహాస్యం చేస్తున్నారని ఇది తగదని అన్నారు. ఇటువంటి అత్యాధునిక యూనిట్ల ఏర్పాటు అన్నది సాధారణ వ్యక్తుల ఏర్పాటు చేయలేరు కనుక వీటి ఏర్పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత ఇస్తున్నాయని అన్నారు. మత్స్య కారుల సంపదకు డిమాండ్ క్రియేట్ చేసేందుకు ఇటువంటి యూనిట్లు అన్నవి ఏర్పాటు చేస్తూ ఉన్నామని చెప్పారు. ఈ జిల్లాలో 27 చోట్ల ఏర్పాటు చేయనున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ విద్యా సాగర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఏడీ శ్రీనివాస్, ఫిషరీస్ డీడీ పీవీ శ్రీనివాసరావు, ఫిషరీస్ ఏడీలు సత్యనారాయణ, సంతోష్, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు కె.నర్సింగ రావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతోనే అధిక దిగుబడులు సొంతం

వ్యవసాయ అధికారి ఎస్ఎస్ఆర్‌వి ప్రసాదరావు

విశాలాంధ్ర-కవిటి: భూసార పరీక్షలతోనే అధిక దిగుబడులు సొంతం చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎస్ ఎస్ ఆర్ వి ప్రసాద్ రైతులకు సూచించారు.ఈ మేరకు గురువారం మండలంలోని శిలగాం రైతు భరోసా కేంద్రం లో మట్టి నమూనా సేకరణ వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మట్టి నమూనాలు తీసి పరీక్షలు నిర్వహించారు.నేల స్వభావాన్ని బట్టి ఏ పంటలు అనవుగా ఉంటాయో రైతులకు వివరించారు.నేల స్వభావం పోషక పదార్థాలు పంట వేసేటప్పుడు వేయవలసిన ఎరువులు తదితర అంశాలపై రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మాదవీలత, గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ అసిస్టెంట్లు, రైతు సిహెచ్ దుర్గారావు పాల్గొన్నారు.

నేటి నుండి అగ్నిమాపక వారోత్సవాలు : డి.ఎఫ్.ఓ వీరభద్రరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో నేటి నుండి ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా విపత్తు స్పందన మరియు అగ్నిమాపక అధికారి బి.వీరభద్రరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన జారీచేసారు. ఈ వారోత్సవాలలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు వహించడం పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 14 నుండి 20వరకు జరగబోయే ఈ వారోత్సవాల్లో ప్రధాన కూడళ్లు, గృహ సముదాయాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు మరియు గ్యాస్ ఏజెన్సీలు, ఆసుపత్రుల సముదాయాలు, వివిధ స్వచ్ఛంధ సంస్థల వద్ద అగ్నిమాపక నివారణ చర్యలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా 14న జిల్లా అగ్నిమాపక కార్యాలయం వద్ద, 15న పాతబస్టాండ్, 16న అఫీషియల్ కాలనీలో గల ధైర్యలక్ష్మీ అపార్టమెంట్ వద్ద, 17న బలగ వద్ద గల కౌముది ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద, 18న 80 అడుగుల రహదారిలో గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద, 19న మెడికవర్ మరియు కిమ్స్ ఆసుపత్రుల వద్ద, 20న అగ్నిమాపక కార్యాలయం వద్ద వివిధ స్వచ్ఛంధ సంస్థలు, రోటరీ వంటి సంస్థలతో వర్క్ షాపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ అవగాహన సదస్సులు శ్రీకాకుళంతో పాటు ఇచ్ఛాపురం, పలాస, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, ఆమదాలవలస, కొత్తూరు, రణస్థలంలలో నిర్దేశించిన ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసారు. అగ్మిమాపక శాఖ చేపట్టే ఈ సదస్సులకు పరిశ్రమలు, గృహ సముదాయాలు, గ్యాస్ ఏజెన్సీలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, నివాస భవనాలలోని ప్రజలు హాజరై అగ్ని నివారణ భద్రతా నియమాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. అగ్నిప్రమాదాలు జరిగితే 101 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని లేదా దగ్గరలోని అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

భూసార పరీక్షలు చేయించండి : జిల్లా వ్యవసాయధికారి శ్రీధర్

విశాలాంధ్ర-మెళియాపుట్టి: రైతులు వారి భూములను భూసార పరీక్షలు నిర్వహించుకుని గ్రామాలలో ఉన్న వ్యవసాయ సిబ్బంది సూచనలు సలహాలు పాటించి అధిక దిగుబడును సాధించి తదానగుణముగా ప్రయోజనం పొందాలని జిల్లా వ్యవసాయధికారి కే. శ్రీధర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మట్టి పరీక్ష వారోత్సవాలలో భాగంగా మండల స్థాయి భూసార పరీక్షల పై శిక్షణా కార్యక్రమంలో భాగంగా మెళియాపుట్టి మండలం, పరశురాంపురం రైతు భరోసా కేంద్రంలో మట్టి పరీక్షలపై గ్రామ వ్యవసాయ,రైతులు, నాయకులతో గురువారం నాడు జరిగిన శిక్షణ శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆర్.బి.కెల ద్వారా ఈ ఏడాది నుండి భూసార పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసుకోవడం వలన రైతులు 12 రకాల పోషకాల పరీక్ష జరిపి రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ ఇవ్వడంజరుగుతుందన్నారు.

పరశురాంపురం ఆర్ బి కే లో క్షేత్రస్థాయిలో మట్టి పరీక్షలు నమూనాలు తీసే విధానంను గ్రామ వ్యవసాయ సహాయకులకు వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన వరి విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామాలలోని అర్హులైన గిరిజన రైతులను గుర్తించి వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది నుంచి చిరుధాన్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని వీటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని వీటిని వినియోగించుకొని రైతులు లబ్ధి పొందాలన్నారు. పరశురాం పురం రైతు భరోసా కేంద్రం పరిధిలో శత శాతం రాయితీపై ఊదలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో పాటు పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు లింగాల మధుబాబు, శ్రీకాకుళం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సిహెచ్. వెంకట్రావు, డిస్టిక్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రేవతి, మండల వ్యవసాయధికారి దానకర్ణుడు, వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు, సర్పంచ్ తెంబూరు ప్రసాదు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి పండుగ విజయవంతం కావాలి

- అవాంఛనీయ సంఘటనలకు తావివ్వరాదు
- కమిటీ,అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఇచ్ఛాపురంలో పదేళ్లకు ఒకసారి జరిగే శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి పండగలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధికారులకు సూచించారు. ఇచ్ఛాపురంలో ఈ నెల 17 నుండి మే 15 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి రెవిన్యూ శాఖ మంత్రి హాజరై ప్రజల సంప్రదాయాలను గౌరవించాలని, అందుకే ఈ నెల రోజులు పండుగను విజయవంతం అయ్యేలా కమిటీ సభ్యులు, అధికారులు భాధ్యతవహించాలన్నారు. ఉత్సవాలకు పరిసర మండలాలు, గ్రామాలలో పాటు ఒడిశా రాష్ట్రం నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. అందువలన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరిగేలా కమిటీ బాధ్యత వహించాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సభ్యులకు సూచించారు. ముఖ్యంగా ప్రత్యేక పర్వదినాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.కమిటీ సభ్యులకు, భక్తులకు అధికారుల సహాయ సహకారాలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. అందరి భాగస్వామ్యం, సహకారంతో పండుగను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అగ్నిమాపక సేవల శాఖ ఈ నెల 14 నుండి 20వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను, బ్యానరును, అదేవిధంగా వడ దెబ్బ తగలకుండా తీసుకోవలసిన చర్యలపై వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన కరపత్రాలను, బ్యానరును ఎం.ఎల్.సి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఉత్సవాలకు ప్రతి రోజూ వేల సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున తప్పిపోయిన వారికోసం, ఇతర సమస్యలు తెలియజేసేందుకు సమాచార కేంద్రాలను పలుచోట్ల ఏర్పాటుచేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున జరిగే ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వరదని సూచించారు. జిల్లా ఎస్.పి జి.ఆర్.రాధిక మాట్లాడుతూ ఉత్సవాలకు ప్రతి రోజూ సుమారు 50 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున, సజావుగా జరిగేందుకు 250 మంది పోలీసులను మోహరిస్తున్నట్లు చెప్పారు. వీరంతా విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వివిధ ప్రదేశాల్లో విధులు నిర్వహిస్తారని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం 113 నెంబరుతో కంట్రోల్ రూముని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పి.రాజ్యలక్ష్మి శాసన మండలి సభ్యులు నర్తు రామారావు, పిరియా సాయి రాజ్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, పలాస ఆర్.డి.ఓ సీతారాంమూర్తి, ఇచ్ఛాపురం తహశీల్దార్ జి.గురుప్రసాద్, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్, కమీషనర్, డి.సి.హెచ్.ఎస్ డా.జె.భాస్కరరావు, డిఎంహెచ్ఓ డా.బి. మీనాక్షి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, ఆర్ అండ్ బి ఎస్.ఈ కె.కాంతిమతి, ఉత్సవ కమిటీ సభ్యులు పి.డి.రెడ్డి, వి.పి.మూర్తి, కృష్ణారావు పాత్రో, ప్రకాశరావు పాత్రో,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం..

- వడదెబ్బవలన సంభవించే మరణాలను అరికడదాం
- డిఎంహెచ్ఓ డా. బి.మీనాక్షి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: వేసవి తీవ్రత వలన శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగి వడదెబ్బకి గురై ఒక్కోసారి మరణాలు కూడా సంభవించవచ్చని, కావున వాటిపట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి.మీనాక్షి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు వడదెబ్బ నివారణ చర్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముద్రించిన బ్యానర్లను, గోడపత్రికలు, కరపత్రాలను రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శాసనమండలి సభ్యులు నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్, జిల్లా యస్.పి జి.ఆర్.రాధిక గారి చేతుల మీదుగా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దృష్ట్యా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగి మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. తద్వారా మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం (హైపో థలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురి అవుతారని తెలిపారు. దీనినే "హీట్ స్ట్రోక్" లేదా 'సన్ స్ట్రోక్"(వడదెబ్బ) అంటారని ఆమె గుర్తుచేసారు. ఇది అత్యంత ప్రమాదకరమని, ప్రాణాంతకమని ఆమె వివరించారు. వడదెబ్బకు గురైన వారిలో చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితి వంటి లక్షణాలుంటాయని ఆమె చెప్పారు. ముఖ్యంగా శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం వడదెబ్బ తగలడానికి గల కారణాలని ఆమె స్పష్టం చేసారు. 65 ఏళ్ల వయస్సు పైబడిన వారు, గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులు, గుండెజబ్బులు, అధిక రక్తపోటుతో బాధపడుతున్నవారు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా గొడుగు వాడటం, తెలుపురంగు లేదా పలుచటి చేనేత వస్త్రాలను ధరించడం, తలకు టోపీ లేదా రుమాలు వాడడం, వేడిగాలులు తగలకుండా చూసుకోవడం వంటివి చేయాలని సూచించారు. అలాగే ఉదయం 10.00గం.ల నుండి సాయంత్రం 4.00గం.ల మధ్యకాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేయకుండా ఉండాలని పేర్కొన్నారు. శీతల పానీయములు, మంచు ముక్కలు వాటిని తీసుకోరాదని, ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు త్రాగడం ఉత్తమమని వివరించారు. రోజులో వీలైనన్ని ఎక్కువసార్లు చల్లని మంచినీరు త్రాగడం, ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని అన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చడం, చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవడం, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చేయడం, ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలేలా ఉంచడంతో పాటు ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణము (ఓ.ఆర్.ఎస్) త్రాగించడం వంటి పనులు చేపట్టాలన్నారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదని, వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఆమె ఆ ప్రకటనలో వివరించారు. ప్రజలు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు వహించి ఆరోగ్యంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

నందిగాంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం

విశాలాంధ్ర-నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజల్లో ఆనందం వెల్లి విరుస్తుందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. గురువారం మండలంలోని పెద్ద తామరపల్లి గొల్లూరు గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే కార్యక్రమాల్లో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ జగనన్న చేపడుతున్న అభివృద్ధి సంక్షేమాలు ప్రజలకు చెప్పారు. పేదవాడు సంక్షేమం ఒక్క జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని అభివృద్ధి సంక్షేమం అమల్లో జగన్మోహన్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. మహిళలు అభివృద్ధి చెందాలన్న ఆశయంతో నేరుగా బ్యాంకులకు ప్రభుత్వ పథకాలు మహిళల పేరున అందజేస్తున్న జగన్మోహన్ రెడ్డి 10 కాలాలపాటు ముఖ్యమంత్రిగా ఉండేందుకు మహిళలంతా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి గ్రామస్తులు, మహిళలతో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మాలి గున్నయ్య, చిన్ని జోగారావు, సంభాన దానయ్య, బోరుభద్ర సోమేశ్వరరావు, చింతాడ శ్రీనివాసరావు, కురమాన ఉత్తమ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా మారిన టిడిపి నేత

విశాలాంధ్ర-పోలాకి: కొన్ని దశాబ్దాల కాలం నుండి నరసన్నపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి ఎనలేని కృషి చేసిన టిడిపి నేత కిల్లి వేణుగోపాల స్వామి ఉపాధ్యాయుడిగా మారారు. ఇప్పటివరకు పోలాకి మండలం, నరసన్నపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలందించి పార్టీకి రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగారు. 1998 డీఎస్సీ లో అర్హత సాధించి న్యాయస్థానం ఆదేశాలు మేరకు జరిగిన కౌన్సిలింగ్ లో పాల్గొని నియామక పత్రం అందుకొని నేడు ఉపాధ్యాయ వృత్తిలో చేరనున్నారు. ఉపాధ్యాయుడైన వేణుగోపాల స్వామి స్వస్థలం పోలాకి మండలం ఊరజాం గ్రామం కాగా, ఇదే మండలం రాజరాంపురం ప్రాథమిక పాఠశాల లో నేడు ఉపాధ్యాయ వృత్తి చేపట్టేనందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయుడు గా జీవితాన్ని ప్రారంభిస్తున్న కిల్లి వేణుగోపాలస్వామికి మాజీ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మిరియప్పల్లి వెంకట అప్పలనాయుడు, మాజీ పోలాకి జెడ్పీసి న్యాయవాదుల జిల్లా సంఘం ప్రతినిధి రోణంకి కృష్ణంనాయుడు, పోలాకి మాజీ సర్పంచ్, జిల్లా రైతు కమిటీ కార్యదర్శి లుకలాపు కల్పన రాంబాబు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బైరి భాస్కరరావు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గొండు మురళి మాజీ సర్పంచులు లుకలాపు రాంబాబు, లావేటి కృష్ణరావు పంచిరెడ్డి సింహచలం, చిట్టి సింహచలం, పప్పల ధర్మారావు, మైలపల్లి త్రినాథ్, వెంకునాయుడు, రామకృష, కృష్ణ, మంగరాజు సూరవు నాని, శ్రీను, రాజు, రామారావు ఎందవ హరి, శశి, రాంబాబు, జల్లు రామారావు, పూజారి శ్రీను, మాజీ ఎంపీటీసీ కొమర ఎర్రయ్య, పూడి కుర్మా రావు హర్షం వ్యక్తం చేశారు.

బోరు తవ్వారు... కనెక్షన్ ఇవ్వడం మరిచారు

స్థలం దానం చేసినందుకు అర్థం లేకుండా పోయింది.... స్థలదాత ఆవేదన

విశాలాంధ్ర-చింతపల్లి : గ్రామంలో తాగునీరు అందిస్తామని చెప్పి తమ సాగు భూమిలో బోరు తవ్వి ఏడాది గడుస్తున్నా, బోరు బావికి కనెక్షన్ ఇవ్వలేదని స్థలదాత పసుపులేటి యోసేపు ఆవేదనను వ్యక్తం చేశారు. స్థలదాత పసుపులేటి యోసేపు అందించిన వివరాల ప్రకారం మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ చెరుకుంపాకలు గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం కింద ఏడాది క్రితం పనులు మంజూరయ్యాయి. అందుకు కొత్తగా బోరు బావి తవ్వాలని అధికారులు చెప్పారు. తమ స్థలంలో బోరు తవ్వించేందుకు ఎవరు ముందుకు రాలేదు. గ్రామంలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారం జరుగుతుందని భావించిన యోసేపు తమ వ్యవసాయ భూమిలో బోరు బావి తవ్వించేందుకు ముందుకు వచ్చాడు. వెంటనే కాంట్రాక్టర్ చకచకా పనులు మొదలు పెట్టాడు. ఇంటింటికి ట్యాపులు బిగించేందుకు తీసుకు వచ్చిన పైపులను అక్కడే వదిలేసి, కొత్తగా తవ్విన బోరు బావికి కనెక్షన్ ఇవ్వడం మరిచారు. పాత పైపులకు ట్యాపులు బిగించి వెళ్ళిపోయారు. దానితో కొత్తగా తవ్విన బోరు బావి, ఇంటింటికి వేసేందుకు తెచ్చిన పైపులు ఏడాదిగా వృధాగా పడి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత అధికారులు స్పందించి కొత్తగా తవ్విన బోరు బావికి కనెక్షన్ ఇవ్వాలని స్థల దాత, గ్రామస్థులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : మండలంలో గల దారెల పంచాయితీ కేంద్ర గ్రామంలో 2023 సంవత్సరము రెండవ గ్రామసభలో పంచాయతీలో గల పోడు భూముల్లో సాగు చేసే రైతులకు 99 మంది అర్హులైన లబ్ధిదారులకు ఓఆర్ఎఫ్ మరియు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను స్థానిక సర్పంచ్ పాండురంగ స్వామి ఎంపీటీసీ మల్లికార్జునారవు చేతులుమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామ సభలో సమస్యలను ముఖ్యంగా మంచి నీరు, సిసి రోడ్లు పరిష్కారం కొరకు తీర్మానం చేసి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య ఎక్కడైతే ఉందో దాన్ని పరిష్కారం కోసం కృషి చేస్తామని వారు ప్రజలకు తెలిపారు. పట్టాల పంపిణీ కార్యక్రమంలోగ్రామ సచివాలయ కన్వీనర్ పాంగి పులి రాజు పంచాయితీ గ్రామస్తులు స్థానికులు సచివాలయ సిబ్బంది మరియు వాలంటీర్స్ అంగన్వాడీ సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నరు.

చెల్లంనాయుడువలసలో రేసర్వే గ్రామసభ



విశాలాంధ్ర,సీతానగరం:మండలంలోని చెల్లం నాయుడువలస గ్రామంలో గురువారం రీసర్వేకు సంబందించిన గ్రామ సభను నిర్వహించారు. తహశీల్దార్ నంది వెంకట రమణ,సర్పంచ్ వాకాడ పారమ్మ,నాయకులు వాకాడ పారి నాయుడు, దాసరి నాగరత్నం, మండల, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారి సుబ్రమణ్యం, సెక్రటరీ పీటర్ పాల్, రైతులు పాల్గొన్నారు. రీసర్వేలో రైతులకు ఉండే సందేహాలను తహశీల్దార్ ఎన్వీ రమణ నివృత్తి చేశారు.

తాగునీటి పైపులైనులకు మరమ్మత్తులు

విశాలాంధ్ర-పొందూరు : నాలుగురోజులుగా మరమ్మత్తులకు గురైన పొందూరు పట్టనానికి త్రాగునీరు అందించే వీధి కుళాయిలకు సరఫరా చేసే పైపులైనుల మరమ్మత్తు పనులు. ముమ్మరంగా చేపట్టారు. పైపులైను మరమ్మత్తులకు గురవ్వడంతో పట్టనానికి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో 7 కానాలు సమీపంలో పైపులైనులు తీరు వుతున్నగుర్తించి మరమ్మత్తులు

ఉపాధ్యాయునిగా జబర్దస్త్ గణపతి

విశాలాంధ్ర-ఆమదాలవలస : 1998 డీఎస్సీ క్వాలిఫై బ్యాచ్ ఉత్తీర్ణత చెందిన మాస్టర్ గణపతి ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు. ఆముదాలవలసకు చెందిన గణపతి మాస్టర్ జబర్దస్త్ కార్య క్రమంలో ఆర్టిస్టుగా అందరికీ సుపరిచితుడే. కెరియర్ ప్రారంభంలో పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయునిగా పనిచేసిన పేడాడ గణపతి రావు 1998 డీఎస్సీ ఉపా ధ్యాయుల నియామకంలో భాగంగా ఆమదా లవలస మండలం సంత కొత్తవలస గ్రామంలో ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు. ఓవైపు విద్యారంగం మరోవైపు కళా రంగము రెండింటిలో రాణిస్తున్న గణపతి మాస్టర్ ను పలువురు అభినందించారు. ఆయన తోపాటు ఆముదలవలసలో మరి కొంత మంది కూడా 1998 బ్యాచ్లో ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు.

సారవంతమైన భూములకోసం భూసార పరీక్షలు

విశాలాంధ్ర-పొందూరు : అధిక దిగుబడి సాధించేందుకు సారవంతమైన భూములను సిద్ధంచేయడం కోసం తరచుగా భూసార పరీక్షలు నిర్వహించాలని మండల వ్యవసాయా ధికారి బెండి బాబి చెప్పారు. మండలకేంద్రంలో ఆర్బీకే-1లో సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్లుకు భూస్తార పరీక్షలపై శిక్షనా కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రైతులపొలాల్లో పరీక్షలు జరిపారు.

ఘనంగా షిరిడిసాయి మందిర ప్రథమ వార్షికోత్సవం

విశాలాంధ్ర-పొందూరు : మండలకేంద్రం పొందూరు ఆర్టీసీ కాంప్లెక్స్ లోని షిరిడిసాయి మందిరం ప్రథమవార్షికోత్సవం ఆలయకమిటీ ఘనంగా నిర్వహిస్తోంది. వార్షికోత్సవంలో బాగంగా గురువారం బాబాకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. బాబా చిత్రపట్టాన్ని పొందూరు పట్టణ వీధుల్లో ఊరేగించారు. శుక్రవారంతో వార్షికోత్సవం ముగుస్తుందని తెలిపారు. బాబా ఊరేగింపులో భారీగా భక్తులు పాల్గొన్నారు. మహిళలు బాబాకు హారతులతో స్వాగతం పలికారు.

జాబ్ కార్డ్ ఉన్నవారందరికీ ఉపాధి కల్పించాల్సిందే

డ్వామా పిడి జీవి చిట్టిరాజు

విశాలాంధ్ర-పోలాకి : జాబ్ కార్డ్ ఉన్న కుటుంబాల వారందరికీ ఉపాధి హామీ పథకం పనుల వద్ద ఉపాధిని చూపించాల్సిందేనని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జివి చిట్టి రాజు సిబ్బందికి స్పష్టం చేశారు. గురువారం సుసరాం పంచాయతీ పరిధిలో అమృత్ సరోవర్ చెరువు, వ్యక్తిగత పండ్ల తోటల పెంపకం పనులను పిడి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలతో రెండు పూటలా పనులు చేయించాలని, సగటు వేతనం రూ. 250 తగ్గకుండా ఉండాలని పేర్కొన్నారు. వంద రోజులు పని దినాలు కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని పంచాయతీల్లోనూ పనులు జరగాలని, ప్రతి పంచాయతీలో నిర్దేశించిన లక్ష్యాలకు తగ్గకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల స్థాయిలో సిబ్బంది అందరూ సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. వేతనదారులు రెండు పూటలా తప్పకుండా పనులకు రావాలని కోరారు. మీకు అవసరమైన సాంకేతిక సలహాలను సిబ్బంది ఎప్పటికప్పుడు అందిస్తారని తెలియజేశారు. ఈ పర్యటనలో పీడీ వెంట సూపరింటెంట్ ఎం రవి కుమార్, ఈసీ గోవిందరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మొంజాపుట్టు గ్రామంలో 'పశు విజ్ఞాన్ బడి'

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : మండల పరిధిలో గల జోలాపుట్ పంచాయతీలో శుక్రవారం పశు వైద్యాధికారి కే భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మొంజాపుట్టు గ్రామంలో పశు విజ్ఞాన్ బడి కార్యక్రమం నిర్వహించా మన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోలాపట్ సర్పంచ్ దొర. నీలకంఠం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందస్తు పశు విజ్ఞాన బడి అనే కార్యక్రమం చేస్తుంది కనుక పంచాయతీ పరిధిలోని రైతులందరూ పశువులకు ఎటువంటి జబ్బులు రాకుండా ఉండాలంటే ఈలాంటి చాలా మంచిది కనుక ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు పశువులకు గాలి కుంట వ్యాధి నివారణ టీకాలు ఆలాగే గొర్రెలు మేకలుకి చీడి పారూడు వ్యాధి నివారణ టీకాలువిధిగా వేయించుకోవాలని ఆయన రైతులకు సూచించారు,అనంతరం వైద్యాధికారి భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క గిరిజన రైతు తాను పెంచుకొంటున ఆవులు మేకలు గొర్రెలకు తప్పనిసరిగా గాలికుంటవ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు,పశు విజ్ఞాన బడి కార్యక్రమం ఏర్పాటు చేసే రైతులందరికీ పలు సూచనలు సలహాలు అవగాహన కల్పించినట్లు వైద్య అధికారి తెలిపారు,ఈ కార్యక్రమం లో ముంచింగిపుట్ పశు వైద్య సిబ్బంది ధర్మారావు రామ నాయుడు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం

విశాలాంధ్ర-జికెవీధి : జికెవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ మొండికోట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బోయిన కుమారి, ఉప సర్పంచ్ జి.బొంజుబాబులులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వారి యొక్క అభిప్రాయాలను తెలుసుకొని జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు ఎస్.సన్యాసిరావు, సచివాలయ కన్వీనర్ కె.రాంబాబు, గృహ సారథి బి.రాములమ్మ, బి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో జగనన్న నీవే మా భవిష్యత్ కార్యక్రమం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం జగన్నాథపురం పంచాయతీలో సర్పంచ్ జోగి రాములమ్మ ఆధ్వర్యంలో, జగనన్న నీవే మా భవిష్యత్తు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథపురం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వైయస్సార్ పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సాగర మత్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పుక్కళ్ళ లక్ష్మణరావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



విశాలాంధ్ర-పలాస: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టీడీపీ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 8వ వార్డు నర్సిపురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పార్టీ, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారని, నిత్యావసర ధరలు, పన్నులు పెంచేశారని అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, గాలి క్రిష్ణ, గురిటి సూర్యనారాయణ, చక్రధర్, నర్సింహులు, మల్లేశ్వరరావు, రామకృష్ణ, సత్యం, కోరికాన శంకర్, బర్ల కృష్ణలు పాల్గొన్నారు.